జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త. కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త
తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి వెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

శనివారం | 29-06-2024 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 58 పేజీలు: 4 వెల : రూ.7

# టోకెన్ అడ్వాన్స్ పేరిట.. స్వాహా





* పోలింగ్ కేంద్రాలకు మెరుగులుదిద్ది నిధులు పక్కదారి * చేయని పనులకు చేసినట్టు చూపించి కాసులు కైంకర్యం * ఫ్యూయల్ బిల్లుల పేరిట అవినీతి * పనులు వేలల్లో.. బిల్లులు లక్షల్లో * ఇద్దరు అధికారులు దోచేశారన్న విమర్శలు * వారికి కొందరు మున్సిపల్ అధికారులు, రెవెన్యూ సిబ్బంది సాయం * ఈ అక్రమాలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లేందుకు కొందరు యత్నాలు * కొత్త ప్రభుత్వం ఆరా తీస్తే వెలుగులోకి మరిన్ని నిజాలు

**ఆమదాలవలస, జూన్ 28 (వార్త):** ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పురపాలక సంఘం అధికారులు టోకెన్ అడ్వాన్సుల పేరిట అవినీతికి తెరలేపినట్లు తెలిసింది. ఎన్నికలు నోటిఫికేషన్ ముందు నుంచి ఎన్నికల రిటర్నింగ్ అధికారులు పోలింగ్ కేంద్రాలను పరిశీలించి అక్కడ కావలసిన వసతి సౌకర్యాలతో పాటు విద్యుదీకరణ, దివ్యాంగులు ఓటు వేసేందుకు వెళ్లే ట్రై సైకిల్ మార్గాలను కూడా ఏర్పాటు చేయాలని ఆదేశించడంతో మున్సిపల్ అధికారులు అవినీతికి తెర తీశారు. మున్సిపాలిటీ పరిధిలో 36 పోలింగ్ కేంద్రాలు ఉండేవి. వాటికి మెరుగులు దిద్ది డబ్బులు పక్కదారి పట్టించే విధంగా పావులు కదిపారన్న విమర్శలు ఉన్నాయి. పార్వతీశంపేటలో మరుగుదొడ్డి నిర్మించి సుమారు 50 వేల రూపాయలు బిల్లులు చెల్లించినట్లు తెలిసింది. అలాగే సొట్టవారిపేట పాఠశాల వద్ద, మరికొన్ని పనులు నిర్వహించేందుకు టోకెన్ అడ్వాన్స్ 2 లక్షల రూపాయలు తీసుకొని పనులు చేయకుండానే చేసినట్టు ఫోటోలు పెట్టి బిల్లులు చేసుకునేందుకు పావులు కదుపుతున్నట్లు తెలిసింది. మున్సిపాలిటీ సిబ్బందితోనే విద్యుత్తు లైట్లు ఏర్పాటు చేసినప్పటికీ, నాడు నేడు పనుల్లో మిగిలిన ఇసుక సిమెంట్ తో చిన్నచిన్న ర్యాంపు పనులను వాటర్ హౌస్ లో ఉన్న వ్యక్తి ద్వారా పనులు చేయించి నిధులు కైంకర్యానికి బిల్లులు ఏర్పాటు చేశారు. ఇప్పటికే టోకెన్ అడ్వాన్స్ తీసుకున్న మొత్తాలను బిల్లులు అప్రూవల్ కాకపోతే ఆ మొత్తాన్ని తిరిగి చెల్లించాల్సిన బాధ్యత ఆ అధికారులపై ఉంది. ఇంతే కాకుండా టోకెన్ అడ్వాన్సుల పేరుతో గతంలో లక్షల రూపాయలు తీసుకొని ఇద్దరు అధికారులు కుమ్మక్కై అవినీతికి పాల్పడ్డారన్న ఆరోపణలు ఉన్నాయి. కొంతమంది నాయకులు హస్తం ఉన్నట్లు కూడా తెలిసింది.

## ఫ్యూయల్ బిల్లు పేరిట స్వాహా..


11 కె.వి విద్యుదీకరణకు గాను అలమాజీపేట పంపు హౌస్ వద్ద విద్యుత్ సరఫరా ఉన్నప్పటికీ నిత్యం జనరేటర్ ద్వారా తాగు నీటిని పంపింగ్ చేస్తున్నట్లు లక్షల్లో ఫ్యూయల్ బిల్లులు డ్రా చేసినట్టు తెలిసింది. నిజానికి విద్యుత్తు లేని సమయంలో ఒక్కో రోజు తాగునీటి సరఫరా ఉండదు. కొన్నిచోట్ల అరకొర తాగునీటిని మాత్రమే అందించి చేతులు దులిపేసు కుంటున్నారన్న విమర్శలతో పాటు పలువురు మహిళలు ఆందోళనలు కూడా చేశారు. పట్టణంలోని ఒక వైసీపీ నేత పెట్రోల్ బంక్ నుంచి ఈ బిల్లులు విడుదల చేస్తున్నట్లు తెలియవచ్చింది. స్థానిక ఎమ్మెల్యే కూన రవికుమార్ మంగళవారం అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్ష నిర్వహించారు. పంపు హౌస్ వద్ద ఫ్యూయల్ బిల్లులు సుమారు 7 లక్షల వరకు పెండింగ్ ఉన్నట్లు అధికారులు నివేదికలో వెల్లడించారు. లెవెన్ కె.వి విద్యుదీకరణ ఉండగా డీజిల్ పెట్రోల్ బిల్లు ఎందుకు అంత వస్తుందో ఆ అధికారులకే తెలియాలి.

## వేలల్లో పనులకు లక్షల్లో బిల్లులు..

తాగునీటి పంపిణీ పైపులైను మరమ్మతు పేరిట కూడా నిధులు దుర్వినియోగం చేస్తున్నట్లు తెలిసింది. అందులో కూడా ఈ అధికారులు ప్రధాన పాత్ర పోషించినట్లు కూడా తెలియవచ్చింది. నిజానికి ఎన్నికల సమయంలో ఏర్పాటు చేసే వసతుల కోసం ఎన్నికల నిధులను ఎన్నికల రిటర్నింగ్ అధికారి అన్నింటికీ సమంగానే పంపిణీ చేశారు. ముఖ్యంగా రెవెన్యూ యంత్రాంగం ఈ పనుల పర్యవేక్షణ బాధ్యతను నిర్వహించారు. అటు రెవెన్యూ పరిధిలోను ఇటు మునిసిపల్ పరిధిలోను బిల్లులు పొందుపరిచినట్లు తెలుస్తుంది. 40 లక్షల రూపాయలతో పాలపోలమ్మ తల్లి గుడికి రహదారి నిర్మాణం చేపట్టారు. గుడి వద్ద కార్లు తిరిగేందుకు వీలుగా సిమెంట్ రహదారి నిర్మించాలని అప్ప టి వైసీపీ నేతలు ఆదేశించడంతో ఆ పనులు కూడా గుత్తేదారు దైవ కార్యక్రమంగా భావించి పనులు పూర్తి చేశారు. ఈ అధికారులు ... మిగతా 3లో

# రిమ్స్‌లో మెరుగైన సేవలే.. నా లక్ష్యం

* కలెక్టర్ సాయంతో ఆసుపత్రిలో మౌలిక సదుపాయాలు * అభా నమోదులో రాష్ట్రంలో మొదటిస్థానం * రోగులు, సిబ్బందికి సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలి * సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ డి.షకీలా



**శ్రీకాకుళం, జూన్ 28 (వార్త):** సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లో రోగులకు మెరుగైన సేవలు అందించడమే నా లక్ష్యమని సూపరింటెండెంట్, ప్రొఫెసర్, డాక్టర్ షకీలా అన్నారు. రిమ్స్ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు తీసుకున్న ఆమెను 'వార్త' ప్రతినిధులు కలిసి అభినందనలు తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కలెక్టర్ డాక్టర్ మనజిర్ జిలాని సమూన్ సాయంతో ఆసుపత్రిలో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నా మన్నారు. ఓపీ కోసం ఆసుపత్రికి వచ్చిన వారంతా అభా (ఆయుష్మాన్ భారత్)లో పేరు నమోదు తప్పనిసరి చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. ఈ మేరకు రిమ్స్‌లో నాలుగు కౌంటర్లు ఏర్పాటు చేసి, సిబ్బందిని నియామకం చేశామన్నారు. ఆసుపత్రిలో సర్జరీ రూమ్‌లలో తగిన సదుపాయాలు లేవని, త్వరలో మాడ్యులర్ ఏసీతో ఆపరేషన్ థియేటర్లు ఏర్పాటు చేస్తామన్నారు. వైద్యులకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పిస్తే మరింత సేవలు అందించగలరన్నారు. ఆసుపత్రిలో రోజుకు ముగ్గురు నుంచి ఐదుగురు వరకూ కిడ్నీ రోగులకు డయాలసిస్ అవుతుందని, నెలకు 80 వరకూ చేస్తున్నామని చెప్పారు. సిటీ స్కాన్‌లు, ఎంఆర్‌ఐ వంటి అధునాతన యంత్రాలతో రోగులకు సేవలు అందుతున్నాయన్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని తెలిపారు. ఆసుపత్రిలో డయేరియా రోగుల కోసం పది బెడ్లను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. అభా నమోదులో రాష్ట్రంలోనే శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రి మొదటి స్థానంలో ఉందని సూపరింటెండెంట్ షకీలా ఆనందం వ్యక్తం చేశారు. జిల్లా సర్వజన ఆసుపత్రిలో పారిశుధ్య పనులు సక్రమంగా జరిగేలా సంబంధిత కాంట్రాక్టర్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామన్నారు. రోగులు, వారి బంధువులు ఆసుపత్రిని శుభ్రంగా ఉండేలా సిబ్బందికి సహకరించాలని కోరారు.

# పోలీసులు.. ఏం చేస్తున్నారు?

* ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్ ఆనుకుని గంజాయి అమ్మకంపై సర్వత్రా చర్చ
* నిఘా కొరవడిందా.. వెనుకుండి నడిపిస్తున్నారా అన్న అనుమానాలు
* 'వార్త'లో కథనం వెలువడిన తర్వాత ఉలిక్కిపడిన పోలీసులు


**శ్రీకాకుళం క్రైం, జూన్ 28 (వార్త):** శ్రీకాకుళం ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌కు ఆనుకుని ఓ బడ్డీలో గంజాయి వ్యాపారం జరుగుతున్నా.. పోలీసులకు తెలియకపోవడం పట్ల కొందరు ముక్కునవేలేసుకుంటున్నారు. ఇది నిజమా.. వారికి తెలియకుండానే ఈ దందా జరుగుతుందా అని మరికొందరు అవాక్కవుతున్నారు. కొందరు పోలీసులు దీని వెనుక ఉన్నారేమో అని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. 'వార్త'లో 'సిక్కోలు గడ్డ.. గంజాయి అడ్డా' శీర్షికన కథనం వెలువడడంతో పోలీసులు ఉలిక్కి పడ్డారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎక్కడెక్కడ గంజాయి పొట్లాలు విక్రయిస్తున్నారన్న దానిపై ఆరా తీస్తున్నారు. దీంతో గంజాయి విక్రయదారులు ష్..గప్‌చుప్ అన్న మాదిరిగా జాగ్రత్తలు పడుతున్నారు. ఇన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నా ఎలా బయటకు వచ్చింది అని ఆశ్చర్యపోతున్నారు.




ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్ఐగా గణేష్ ఉన్నప్పుడు గంజాయి బ్యాచ్‌ను స్టేషన్‌కు తీసుకువచ్చి పోలీస్.. అంటే ఏమిటో రుచి చూపించారు. ఆ ఎస్ఐకి సిబ్బంది నుంచి సహకారం కూడా ఉండేది. దీంతో కొన్ని నెలలు పాటు గంజాయి అమ్మకాలు కొంత మేర నిలిచిపోయాయి. ఆయన బదిలీ తర్వాత వ్యాపారులు ఊపిరిపీల్చుకున్నారు. తమ వ్యాపారాన్ని మరింతగా పెంచేశారు. సార్వత్రిక ఎన్నికలు రావడంతో పోలీసులు, అధికారులు బందోబస్తులో నిమగ్నం ... మిగతా 3లో

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం





## ఆధ్యాత్మిక చింతన అవసరం

**సారవకోట/జలుమూరు, జూన్ 28 (వార్త):** సారవకోట మండలం చీడిపూడి గ్రామంలో జగదుర్గ శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ 18వ వార్షిక మహోత్సవంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి శుక్రవారం పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ ఆధ్యాత్మిక చింతన అవసరమన్నారు. ఆయన వెంట ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు, మండల అధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బైరి భాస్కరరావు, నాయకులు నిక్కు జనార్ధన్, బోర ధనుజయ్, కింజరాపు రాము, డాకోజు కోటీశ్వరరావు పాల్గొన్నారు.

# ఆ నలుగురు.. సేవామూర్తులు

*** రక్తదానంతో ప్రాణాలు రక్షిస్తున్న సేవాసంస్థ * అవసరార్థులకు తక్షణ రక్తసాయం * రోగుల వద్దకే వెళ్లి రక్తదానం * ప్రత్యేకంగా ఫోన్ నంబరు ఏర్పాటు * ఆదుకుంటున్న అంబులెన్స్ సేవలు * కిడ్నీ బాధితుని కష్టంతో ప్రారంభమైన సేవ**

**మందస, జూన్ 28 (వార్త):** ఉద్దానంలోని ఓ సంఘటన ఆ యువకుల ఆలోచనకు నాంది పలికింది. రోగులు పడుతున్న కష్టాలను కనులారా తిలకించి, చలించిపోయారు. ముఖ్యంగా ఉద్దానంలోని కిడ్నీవ్యాధిగ్రస్తులు డయాలసిస్ సమయంలో పడుతున్న కష్టాలు వారిని కదిలించాయి. ఈ కదలికే వారిని కొత్త ఆలోచనకు దారి తీసింది. ప్రాణం నిలపడానికి ఎంతో అవసరమైన రక్తాన్ని దానం చేయాలన్న సంకల్పం నేడు ఎంతో మంది ప్రాణాలను నిలుపుతోంది. వైద్యంతో డాక్టర్ రోగుల ప్రాణాలను కాపాడుతుంటే.. ఆ యువకులు చేపట్టిన యజ్ఞం మంచి సత్ఫలితాలను అందిస్తోంది. దీంతో ఆ యువత చేస్తున్న సామాజిక సేవకు ప్రతీ ఒక్కరూ అభినందిస్తున్నారు. మందస మండలంలోని ఉద్దానం కేంద్రంగా ఆ నలుగురు సేవా సంస్థ అందిస్తున్న సేవలపై 'వార్త'లో ప్రత్యేక కథనం.



మందస మండలంలోని ఉద్దాన ప్రాంతమైన దున్నవూరు పంచాయతీలోని మత్స్యకార గ్రామమైన గెడ్డవూరు గ్రామానికి చెందిన పిచ్చుక జోగారావు కిడ్నీవ్యాధితో బాధ పడుతుండేవారు. 2017-18 సంవత్సరంలో డయాలసిస్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. కష్టమ్మీద డయాలసిస్ చేస్తుండగానే, కొన్ని సమయాల్లో రక్తం అవసరం పడింది. దీంతో రక్తం కోసం ఆ కుటుంబం చాలా ఇబ్బందులు పడింది. ఈ తరుణంలో జోగారావు కన్నుమూశారు. తన తండ్రి ప్రాణాలు నిలపడానికి జోగారావు కుమారుడు పాపారావు ఎంతగానో ప్రయత్నించినప్పటికీ.. ఫలించలేదు. కానీ.. పాపారావు అదే సంవత్సరంలో ఓ సేవాసంస్థను ఏర్పాటు చేసి, రక్తదానం చేయాలని మదిలో మెదిలింది. 2018 జూన్ 29న ఆ నలుగురు సేవాసంఘం/సంస్థను ఆయన ఏర్పాటు చేశారు. సానా ఈశ్వరరావు, టి.తేజేశ్వరరావు, చొక్కర నరహరి, బట్టి రాజు, సీహెచ్ దామోదర్, టి.భాగ్యలక్ష్మి, హేమలత, రాజు, తరుణ్, మనోజ్ తోడయ్యారు. సంస్థ చక్కగానే పని చేస్తున్నప్పటికీ, సమాచారం అందిపుచ్చుకోవడానికి కొన్ని సమస్యలు ఏర్పడడంతో ఆ నలుగురు అనే వాట్సాప్ గ్రూపును ఏర్పాటు చేశారు. రక్తదానానికి ఉత్సాహవంతులైన యువతను ఆహ్వానించారు. రక్తదానం చేస్తూ.. మరో నలుగురితో రక్తదానం చేయిద్దాం అనే నినాదంతో గ్రూపు ముందుకు సాగుతోంది. ఉన్నతాధికారులు, అధికారులు, వైద్యులు, ప్రజాప్రతినిధులు సహకారం కూడా లభించింది. మందస, పలాస, సోంపేట మండలాల పరిధిని దాటి ఇచ్ఛాపురం నుంచి శ్రీకాకుళం, విజయనగరం వరకు ఆ నలుగురు సేవలు విస్తరించాయి. రక్తదాన శిబిరాలు నిర్వహించడం, సేకరించిన రక్తాన్ని బ్లడ్ బ్యాంక్‌లకు అందివ్వడం చేస్తున్నారు. అంతేకాకుండా, అత్యవసర పరిస్థితులు, ప్రమాదాలు, రోగులకు అవసరమైన ఆయా ఆసుపత్రులకు వెళ్లి మరీ ఆ నలుగురు సభ్యులు అందిస్తున్నారు. వాట్సాప్ ద్వారా క్షణాల్లో సమాచారం అందుకుని, నిస్వార్థంగా బ్లడ్‌ను అందిస్తున్నారు. కాగా, ఆ నలుగురు సేవాసంస్థను మరో నాలుగు వాట్సాప్ గ్రూపులకు విస్తరించారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 3వేల మంది వరకు సభ్యులు ఆ నలుగురు గ్రూపుల్లో సభ్యులుగా ఉంటూ, అత్యవసర సమయాల్లో రక్తదానం చేస్తున్నారు. సంస్థ ఏర్పాటు చేసినప్పటి నుంచి సుమారు 20వేల మందికి రక్తదానం చేశారు. 30 మెగా క్యాంపులు, 50కి పైగా రక్తదానం అవగాహన సదస్సులు, ర్యాలీ నిర్వహించారు. ఆ నలుగురు చేస్తున్న సేవను పలువురి మన్ననలు అందుకుంటోంది.







### ఏ సమయంలోనైనా రక్తం అందిస్తాం



సంస్థకు జిల్లా వ్యాప్తంగా సభ్యులు ఉన్నారు. ప్రతీ ఒక్కరూ ఏ సమయంలోనైనా రక్తదానం చేయడానికి సిద్ధంగా ఉన్నారు. అత్యవసరమనుకుంటే.. ఫోన్ ద్వారా వారిని సంప్రదించి, రాత్రి వేళల్లో కూడా ఆసుపత్రులకు వెళ్తున్నాం. సంస్థలో పని చేస్తున్న సభ్యులు సేవలు వెలకట్టలేనివి. ప్రమాదబాధితులు, రోగులకు రక్తంఅందించిన అనంతరం వారు చూపుతున్న అభిమానం ఎంతో విలువైనది.

**- సానా ఈశ్వరరావు, కోశాధికారి, పూండి, వజ్రపుకొత్తూరు**




### రక్తదానంపై యువత చైతన్యం



మారుమూల గ్రామమైన గెడ్డవూరు కేంద్రంగా ఆ నలుగురు సేవాసంస్థను ఏర్పాటు చేశాం. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా సేవలు అందిస్తున్నాం. రక్తదానంపై యువత చైతన్యం అవుతున్నారు. అపోహలు తొలగిపోతున్నాయి. 10మందితో ఏర్పాటు చేసిన సంస్థ నేడు సుమారు 3వేలకు చేరుకుంది. 2018-19లో 278 మందికి మాత్రమే రక్తదానం చేశాం. నేడు 20వేల మందికి చేరుకుంది. అందరి సహకారంతో మరింత సేవలు అందిస్తాం. రక్తం అవసరం ఏర్పడితే 8500273573 అనే ఫోన్ నంబరుకు సమాచారం అందివ్వాలి.

**- పిచ్చుక పాపారావు, వ్యవస్థాపక అధ్యక్షుడు, గెడ్డవూరు, మందస**

### రోగుల ప్రాణాలను కాపాడుతున్న ఆ నలుగురు



అత్యవసర సమయాల్లో రక్తం ప్రాణాన్ని నిలుపుతుంది. గతంలో ఎందరో అత్యవసర సమయాల్లో రక్తం లభించక మరణించిన సంఘటనలున్నాయి. ఆ నలుగురు సేవా సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయం. వేలాది మంది సభ్యులతో రక్త దానం చేస్తోంది. రాత్రనక, పగలన.. ఏ సమయంలో సమాచార మిచ్చినా రక్తదానానికి సభ్యులు సిద్ధంగా ఉన్నారు. డాక్టర్గా చికిత్స చేస్తుంటే.. సామాజిక సేవకులుగా రక్తం అందించి ప్రాణాలు నిలుపుతున్నారు. రక్తదానం చేయడమే కాదు.. దీనిపై అవగాహన, చైతన్యం చేస్తున్న తీరు ముదావహం.

**-డాక్టర్ కూన మోహన్ బాబు, ఎండీ, జనరల్ మెడిసిన్, పలాస**



## ఖరీఫ్‌లో ప్రతి ఎకరాకూ సాగునీరు

**పోలాకి/జలుమూరు, జూన్ 28 (వార్త):** పోలాకి మండలం బొద్దాం జంక్షన్ నుంచి దండు లక్ష్మీపురం జంక్షన్ వరకు వంశధార కాలువలో పూడికతీత పనులను ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సాగునీటి కాలువలు మరమ్మతు పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేసేలా చర్యలు చేపడుతున్నామన్నారు. కూటమి ప్రభుత్వం వ్యవసాయ రంగానికి ప్రాధాన్యతను ఇస్తుందని, రైతు సంక్షేమం లక్ష్యంగా పనిచేస్తుందని తెలిపారు. మండలంలో చిట్టచివరి భూములకు సాగు నీరు అందేలా చూస్తామన్నారు. సాగునీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా చూడాలని, గుర్రపుడెక్క, పూడికతీత పనులు, మరమ్మత్తు పనులు చేపడతామన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మిరియాపల్లి వెంకటప్పలనాయుడు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బైరి భాస్కరరావు, మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు తమ్మినేని భూషణ్ రావు, లుకలాపు రాంబాబు, డోల ప్రసాద్, కరుకోల దుష్యంత్, గొర్లె ఎర్రయ్య, పాలిన ప్రసాద్, చింతు కర్రెన్న, బెవర సింహాద్రి, అన్నాజీరావు, మురళి, వంశధార అధికారులు పాల్గొన్నారు.

## విద్యలో ప్రతిభ కనబరచాలి



**జలుమూరు, జూన్ 28(వార్త):** ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థిని విద్యార్థులు చదువులో మంచి ప్రతిభ చూపాలని జలుమూరు జడ్పిటిసి మెండ విజయశాంతి రాంబాబు కోరారు. ప్రభుత్వం పిల్లలకి అందిస్తున్న పుస్తకాలు ఇతర వస్తు సామాగ్రిని జలుమూరు బాలికల హైస్కూల్లో పిల్లలకు అందజేశారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు బమ్మిడి మాధవరావు ప్రసాదరావు, ప్రధానోపాధ్యాయుడు ఇప్పిలి వేణుగోపాలరావు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

## మూలిపాడు పంచాయతీలో పారిశుధ్య పనులు



**మందస, జూన్ 28 (వార్త):** వర్షాకాలం కావడంతో వానలు పడుతున్నాయి. దీంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉండడంతో ఆయా పంచాయతీల సర్పంచ్లు గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపడుతున్నారు. వైసీపీ యువ నాయకుడు, మూలిపాడు సర్పంచ్ గుసిరి వెంకటరావు ఆధ్వర్యంలో మూలిపాడు, శ్రీనివాసపురం, గోపాలపురంలలో పారిశుధ్య పనులు ముమ్మురంగా చేపట్టారు. పూడుకుపోయిన కాలువల్లోని బురద, మురికిని తీయించారు. పిచ్చిమొక్కలను తొలగించారు. బోర్లు, బావుల వద్ద శుభ్రపరిచారు. బావుల్లో క్లోరినేషన్ చేయించారు. ప్రజల సహకారంతోనే ఆరోగ్య సమాజం సాధ్యపడుతుందన్నారు. పారిశుధ్య పనులను ఎంపీడీఓ అరసాడ రఘుపతిరావు, పంచాయతీ కార్యదర్శులు బేసి ఈశ్వరరావు, బొంతు రమణ పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు పిట్ట భీమారావు, టెంక నవీన్కుమార్, దట్టి కోదండరావు, తెలుకల దుదిషి తదితరులు పాల్గొన్నారు.



**పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పీఏగా కె.నవీన్ నియామకమయ్యారు. శుక్రవారం ఆయన నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు.**

**- పాతపట్నం, జూన్ 28(వార్త)**

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నూతన అధ్యక్షుడుగా ప్రమాణ స్వీకారం చేసిన పల్లా శ్రీనివాసరావును పాతపట్నం నియోజకవర్గం శాసనసభ్యుడు మామిడి గోవిందరావు కలిసి అభినందనలు తెలిపారు. పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. పార్టీ బలోపేతానికి తనవంతు సహకారం అందిస్తానని గోవిందరావు ఈ సందర్భంగా అన్నారు.

- పాతపట్నం, జూన్ 28(వార్త)



## స్టేట్ ర్యాంకర్‌కు టీడీపీ నేతల అభినందన

**సంతబొమ్మాళి, జూన్ 28(వార్త):** ఆంధ్ర ప్రదేశ్ పోస్ట్ గ్రాడ్యుయేషన్ ప్రవేశ పరీక్షలో బోటనీ విభాగంలో మొదటి ర్యాంకు సాధించిన నౌపడా పంచాయతీ సీతానగరం గ్రామానికి చెందిన నీలాపు రుక్మిణిని తెలుగుదేశం పార్టీ శ్రేణులు అభినందించారు శుక్రవారం సాయంత్రం సీతానగరం మాజీ ఎంపీపీ కర్రీ విష్ణుమూర్తి, మాజీ ఎంపీటీసీ వాడరేవు కృష్ణారావు పుష్పగుచ్ఛాన్ని అందించి శుభాకాంక్షలు తెలిపారు నిరుపేద కుటుంబంలో పుట్టినప్పటికీ రాష్ట్రస్థాయిలో బాటనీ విభాగంలో ఫస్ట్ ర్యాంక్‌గా నిలవడం అభినందనీయమని తన విద్య అవసరాలకు ఎటువంటి సహాయం కావాలన్నా చేస్తామని టిడిపి నేతలు భరోసా ఇచ్చారు. విద్యార్థుల తల్లి నీలాపు లక్ష్మీదేవి ఆశ వర్కర్‌గా పనిచేస్తున్న నేపథ్యంలో ఈ విద్యార్థి ఉన్నత విద్యకు అవసరమైతే సహాయాన్ని అందిస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం తెలుగు యువత నాయకుడు కోట రాము రెడ్డి, సుగ్గు నాగిరెడ్డి, బచ్చుల చిన్న బాబు మాజీ విద్యా కమిటీ చైర్మన్ అనపాన నగేష్ రెడ్డి, సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు దళ్లి రాజు కూర్మాపు రాంబాబు, సుబ్బారావు, సుగ్గు చిన్నా రావు పాల్గొన్నారు.

## క్రీడాకారుడికి ఆర్థిక సాయం



**పాతపట్నం, జూన్ 28(వార్త):** ప్రహరాజపాలేం గ్రామానికి చెందిన కిరీటం సీతయ్య ఆంధ్రప్రదేశ్ సీనియర్ పురుషుల ఫుట్‌బాల్ టీంకు ఎంపికకావడంపై శాసనసభ్యుడు మామిడి గోవిందరావు అభినందించారు. ఈనెల 29,30వ తేదీల్లో పూణే వేదికగా జరగబోయే టోర్నీలో పాల్గొనుటకు సీతయ్య ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న గోవిందరావు సీతయ్యకు ఆర్థికసాయం చేశారు. టోర్నీలో పాల్గొని సత్తా చాటాలని సూచించారు.

## కాలువలో పూడిక తీత పనులు ప్రారంభం



**గార, జూన్ 28 (వార్త):** టీడీపీ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కృషి చేస్తుందని పార్టీ గార మండల అధ్యక్షుడు లోపింటి రాధాకృష్ణ అన్నారు. ఎమ్మెల్యే గొండు శంకర్ ఆదేశాల మేరకు శుక్రవారం బైరిదేశిగెడ్డలో పూడికతీత పనుల ను ప్రారంభించారు. ఆరంగిపేట జంక్షన్ నుంచి గార హాస్పిటల్ వరకు కాలువలో పూడికలు తీయనున్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ అనిల్ కుమార్, జేఈ కావ్య, వర్క్ ఇన్స్పెక్టర్ వెంకటరావుతో పాటు టీడీపీ జిల్లా వాణిజ్య విభాగ ప్రధాన కార్యదర్శి, కళింగపట్నం మాజీ సర్పంచ్ పొట్నూరు కృష్ణ మూర్తి, వజ్జ సూరిబాబు, చమల్ల కన్నబాబు, మల్ల త్రినాథ్, పంది పరమేష్, కొన్ని రమణ, వమరవల్లి జీను బాబు, కల్లె దశరథ, జీరు జగదీష్, సుగ్గు గోవింద రెడ్డి , సుగ్గు నాగరాజు, వజ్జా మన్మదరావు, రైతులు పాల్గొన్నారు.

## వేంకటేశ్వర ఆలయంలో చోరీ

**పాతపట్నం, జూన్ 28 (వార్త):** పాతపట్నం మార్కెట్ యార్డు ఎదురుగా వున్న వేంకటేశ్వర ఆలయంలో గురువారం అర్ధరాత్రి ఇద్దరు దొంగలు పడ్డారు. హుండీని పగులగొట్టి నగదును దొంగిలిం చారు. స్వామి వారి వెండి కిరీటాన్ని తస్కరించుకుపోయారు. శు క్రవారం ఉదయం ఆలయ అర్చకులు తలుపు తెరువగా హుండీ పగులగొట్టి వున్నట్టు గుర్తించారు. వెంటనే పోలీ సులకు సమాచారం అందించారు. పోలీసులు ఆలయానికి వచ్చి చోరీ జరిగిన తీరును పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.




# డాక్టర్లు కావలెను

* పీహెచ్‌సీల్లో వైద్యులు, సిబ్బంది కొరత * డిప్యూటేషన్ పేరుతో విధులకు డుమ్మా * రోగులకు అందని వైద్యసేవలు
* పట్టించుకోని జిల్లా వైద్యఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు



**సంతబొమ్మాళి, జూన్ 28 (వార్త):** ప్రభుత్వం ప్రతియేటా వైద్యానికి కోట్లాది రూపాయలు నిధులు విడుదల చేస్తుంది. అయినప్పటికీ సిబ్బంది లేక రోగులకు ఆశించిన స్థాయిలో వైద్యం అందడం లేదు. గ్రామీణ ప్రాంతాల ప్రజల రోగ నిర్ధారణ విషయంలో రోగి నాడి పట్టడంలో సిబ్బంది కొరత వలన వైద్యం మమ అనిపిస్తున్నారు. పేదలకు ఉచిత వైద్యం అందించడమే లక్ష్యంగా సాగుతూ కోట్లాది రూపాయల నిధులు విడుదల అవుతున్న నిర్లక్ష్యం అవినీతి, వైద్యుల కొరత స్టాఫ్ నర్సులు, సిబ్బంది కొరత వెరసి గ్రామీణ వైద్యం చతికిలబడుతోంది. అలానే సిబ్బంది కొరతతో కొందరికి డిప్యూటేషన్‌పై నియమించగా దీనిని ఆసరాగా తీసుకుని విధులకు డుమ్మా కొడుతున్నారు. గ్రామీణ ఆసుపత్రిలో సరైన వైద్యం అందడం లేదని టెక్కలి జిల్లా ఆసుపత్రికి వెళితే అక్కడున్న ప్రతీ వైద్యాధికారి ప్రైవేట్ ప్రాక్టీస్ మోజులో పడి టెక్కలి జిల్లా ఆస్పత్రిలో నామమాత్రపు విధులు నిర్వహిస్తున్నారు. వీరిని ఉన్నతాధికారులతో పాటు రాజకీయ నాయకులు, మంత్రులు హెచ్చరికలు చేస్తున్నా.. ఐ డోంట్ కేర్ అన్నట్టుగానే అక్కడ వైద్యులు ఉంటున్నారని రోగులు ఆరోపిస్తున్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల ఆరోగ్యం కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నా క్షేత్రస్థాయిలో సిబ్బంది కొరత, నిర్లక్ష్యం కారణంగా అనుకున్న ఫలితాలు రావడం లేదన్న విమర్శలు లేకపోలేదు. సంతబొమ్మాళి మండలంలో ఉన్న నాలుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మౌలిక వసతులతో పాటు వైద్యులు, సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. ఉన్న అరకొర సిబ్బందిని డెప్యుటేషన్‌పై వేరే చోటకి పంపించడం గమనార్హం.



### దండుగోపాలపురం:

ఇక్కడి ఆరోగ్య కేంద్రం పని చేసేది 24 గంటలు అయినప్పటికీ వైద్యాధికారి ఒక్కరే విధులు నిర్వహిస్తున్నారు. ఈ పిహెచ్‌సి పరిధిలో సుమారుగా 16 వేల మంది పైగా జనాభా ఉండగా 3 సబ్ సెంటర్లు ఉన్నాయి. సిబ్బంది విషయానికి వస్తే ఒక వైద్యాధికారి, ఒక పిహెచ్ఎన్, ఇద్దరు ఏఎన్ఎంలు కొరత ఉన్నప్పటికీ జిల్లా వైద్యాధికారులు పట్టించుకోవడం లేదు.



### బోరుభద్ర:

ఈ ఆసుపత్రిలో 24 గంటలు పాటు సేవలు అందించాల్సివుంది. దీని పరిధిలో సుమారుగా 22 వేల జనాభా ఉండగా నాలుగు సబ్ సెంటర్లు ఉన్నాయి. ఈ ఆరోగ్య కేంద్రానికి ఇద్దరు స్టాఫ్ నర్స్ లు, ఒక సూపర్వైజర్, ఇద్దరు ఏఎన్ఎంలు, ఒక ఈవో, ఒక పీహెచ్ఎన్, కొరత ఉన్నప్పటికీ జిల్లా యంత్రాంగం పట్టించుకోవడం లేదు.




### సంతబొమ్మాళి:

మండల కేంద్రమైన సంతబొమ్మాళి ఆసుపత్రి పరిధిలో సుమారుగా 16000 మంది జనాభా ఉండగా 3 సబ్ సెంటర్లు ఉన్నాయి. ఇక్కడ వైద్యాధికారులు, వైద్య సిబ్బంది కొరత లేనప్పటికీ, నైట్ వాచ్ మెన్, వాష్ రూమ్ కొరత ఉన్నట్లు తెలుస్తోంది.

### నౌపడ:

ఈ ఆరోగ్య కేంద్రం పేరుకే 24గంటల ఆసుపత్రిగా నిలిచింది. గతంలో ఈ పీహెచ్సీలో వైద్యాధికారిని డమ్మీ సెలవు చీటీ పెట్టి విధులకు డుమ్మా కొట్టిన డిఎంహెచ్ఓ ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఇటీవల ఇదే ఆసుపత్రికు పురిటి నొప్పులతో, రక్తస్రావంతో వచ్చిన గర్భిణీకు వైద్యం అందించేందుకు వైద్యులు, సిబ్బంది లేక నిండు గర్భిణీ ప్రసవ వేదనకు గురైంది. ఈ ఆసుపత్రి పరిధిలో సుమారుగా 22000 జనాభా ఉండగా 3 సబ్ సెంటర్లు ఉన్నాయి. అయితే ఈ ఆసుపత్రికి సిబ్బంది కొరత ఎప్పటి నుంచో వెంటాడుతుంది. ముఖ్యంగా ఇక్కడ పని చేయవలసిన రెగ్యులర్ స్టాఫ్ నర్స్ బదిలీపై వెళ్లగా ఆమె స్థానంలో వేరొక సిబ్బందిని నేటికి భర్తీ చేయలేదు. ఈపిహెచ్సికి ఇద్దరు స్టాఫ్ నర్సులు, ఇద్దరు ఏఎన్ఎంలు కొరత ఉంది.

### పట్టించుకోని డీఎంహెచ్‌వో

సంతబొమ్మాళి మండలంలో నౌపడ, దండుగోపాలపురం, బోరుభద్ర పిహెచ్‌సిలకు సిబ్బంది, వైద్యుల కొరత వేధిస్తుంది. జిల్లా వైద్యాధికారికి ఆసుపత్రుల పరిస్థితి, సమస్యలపై వివరించేందుకు ఎన్నిసార్లు డీఎంహెచ్ఓకు ఫోన్ చేసినా స్పందించిన దాఖలాలు లేవని పలువురు చెబుతున్నారు. పలువురు రాజకీయ ప్రతినిధులు ఆసుపత్రుల స్థితిగతులపై డీఎంహెచ్‌వో దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకుండా పోయింది. దీంతో ఆసుపత్రుల్లో వైద్యులు తీరు, సిబ్బంది కొరతపై పలువురు కలెక్టర్‌తో సీఎం పేషీకి ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నారు.




## పోలీసులు.. ఏం చేస్తున్నారు?

(మొదటిపేజీ తరువాయి)

కావడంతో గంజాయి వ్యాపారం మళ్లీ పుంజుకుంది. గంజాయి మత్తులో కొందరు వీరంగం చేస్తున్న ఘటనలు నగరంలో కోకొల్లలు. జిల్లా ఎస్పీ జీఆర్ రాధిక శ్రీకాకుళం జిల్లాలో గంజాయి అమ్మకాలు, తరలింపు జరగకుండా గట్టి చర్యలు తీసుకుంటునే ఉన్నారు. ఎప్పటికప్పుడు జిల్లా పోలీసు అధికారులతో నేర సమీక్షా సమావేశాల్లో గంజాయిపై ఉక్కుపాదం మోపాలని ఆదేశాలు జారీ చేస్తున్నారు. ఎంతటివారైనా ఊపేక్షించవద్దని హెచ్చరికలు చేస్తున్నారు. పోలీసు అధికారుల నిర్లక్ష్యమో.. లేకుంటే అలసత్వమో గాని గంజాయి అమ్మకాల నియంత్రణలో విఫలమవుతున్నారు.

## టోకెన్ అడ్వాన్స్ పేరిట అవినీతి!

(మొదటిపేజీ తరువాయి)

చెరువును కప్పేందుకు సుమారు ఐదున్నర లక్షల రూపాయలు మునిసిపల్ నిధుల నుంచి డ్రా చేశారు. ఇలా వేలల్లో జరిగే పనులకు లక్షల్లో బిల్లులు పెట్టి అవినీతికి పాల్పడ్డారన్న విమర్శలు ఉన్నాయి.

**తాను అప్పట్లో విధుల్లో లేను..**

ఎన్నికల సమయంలో పనులు చేసేందుకు ఏఈ పేరున టోకెన్ అడ్వాన్స్ తీసుకున్నారు. అప్పటికి నేను విధుల్లో చేరలేదు. ఆ తరువాత వాటిని పరిశీలించాను. వాటికి సంబంధించిన బిల్లులు సక్రంగా లేకపోవడంతో వాటిని ఇంకా పరిశీలించలేదు.

**- గుర్రం రవి, మున్సిపల్ కమిషనర్, ఆమదాలవలస**

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక



శ్రీకాకుళం

## ప్రతి ఆదివారం ధ్యానంపై అవగాహన

**బూర్జ, జూన్28(వార్త):** కొల్లివలస గ్రామంలో ప్రతీ ఆదివారం సత్సం గం, ధ్యానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నామని ఆధ్యాత్మిక జీవన సమాజము (ఎ మిషన్ ఆఫ్ శ్రీ రామచంద్ర) జోనల్ కోఆర్డినేటర్ ఎస్ ఉమామహేశ్వరరావు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక మండల ప్రజా పరిషత్ పాఠశాలలో ఉదయం ఆరు గంటల నుండి ఎనిమిది గంటల వరకు నిర్వహిస్తామన్నారు. ధ్యానం చేయడం వల్ల శారీరక ఆరోగ్యము, మానసిక ప్రశాంతత, ఆత్మ ప్రకాశము కలుగుతాయని అన్నారు. మన ఋషులు అందించిన భారతీయ ధ్యానాన్ని నేటి శాస్త్రీయ పరిజ్ఞానం ఎలా సమర్ధిస్తుందో తెలియజేస్తూ నేటి సమాజాన్ని శాసిస్తున్న ఈ రుగ్మతలను పారాద్రోలుతూ, శారీరక ఆరోగ్యం మానసిక, ప్రశాంతత ఆర్థిక స్వాలంబన, ఆనందకరమైన జీవితము, ఆధ్యాత్మిక ప్రగతిని సహజమార్గ రాజయోగం ద్వారా అందిస్తూ నైతిక ధార్మిక విలువలను పెంపొందిస్తూ ఆరోగ్యకరమైన భావి భారత సమాజాన్ని మీ సహకారంతో అందించవచ్చునని పేర్కొన్నారు.

# ఆహ్లాదం కరువు


* కళా విహీనంగా ఎర్రంనాయుడు పార్క్
* ఎండిపోతున్న మొక్కలు
* విరిగిపోయిన ఉయ్యాలలు
* పూర్వ వైభవం తెచ్చేందుకు టీడీపీ నేతలు ప్రయత్నం




**టెక్కలి, జూన్ 28 (వార్త):** టెక్కలి ప్రజలకు ఆహ్లాదం పంచేందుకు లక్షలాది రూపాయలతో నిర్మించిన ఎర్రన్నాయుడు పార్కు నిరాదరణకు గురైంది. 2014లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత టెక్కలి జాతీయ రహదారికి ఆనుకొని వాటర్ ప్రాజెక్టు దగ్గర రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నా యుడు 80 లక్షల నిధులతో ఎర్రన్నాయుడు పార్క్‌ను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. టెక్కలి పట్టణ ప్రజలు వాకింగ్ చేసుకోవడానికి కాకుండా పిల్లలు ఆడుకునేందుకు సువిశాలమైన పార్కును నిర్మించారు. పిల్లలు ఆడుకునేందుకు పలు ఉయ్యాలలు, జారుడు బల్లలు తదితర ఆట వస్తువులు ఏర్పాటు చేశారు. ఎర్రం నాయుడు, ఎన్టీఆర్ విగ్రహాలతో పాటు బుద్ధుడు, తెలుగుతల్లి విగ్రహాలను నిర్మించారు. వాటర్ ఫౌంటెన్‌లు కూడా ఏర్పాటు చేశారు. పార్క్ నిర్వహణను పంచాయతీకి అప్పజెప్పారు. అయితే సంబంధిత అధికారుల నిర్లక్ష్యం ఈ పార్క్ పాలిట శాపంగా మారింది. ప్రస్తుతం ఆ మొక్కలు ఎండిపోయాయి. పార్కులో లైట్లు కూడా వెలగడం లేదు. పార్కులో పాములు పుట్టలు వెలిశాయి. రోడ్లు పాడయ్యాయి. తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పాటై కింజరాపు అచ్చెన్నాయుడు మంత్రి అయిన తర్వాత ఈ పార్కుకు మహర్దశ కలిగింది. ఈ పార్కును అభివృద్ధి చేసేందుకు గాను టీడీపీ టెక్కలి మండల అధ్యక్షుడు బగాది శేషగిరిరావు ఇటీవల పార్కును సందర్శించారు. ఈ పార్కు అభివృద్ధికి కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. మరికొద్ది రోజుల్లో ఈ పార్కుకు పూర్వ వైభవం తెచ్చేలా చర్యలు తీసుకుంటున్నట్లు బగాది శేషగిరి తెలిపారు.







## నేడు అరసవల్లిలో ద్విశతావధానం

**అరసవల్లి, జూన్ 28 (వార్త):** ఆరోగ్య ప్రదాత సూర్యనారాయణ స్వామి దేవస్థానం ఆలయ అనివెట్టి మండపంలో శనివారం ఉదయం పది గంటలకు శ్రీ సుమిత్ర కళాసమితి నిర్వాహకుడు, ఆలయ ప్రధాన అర్చకుడు ఇప్పిలి శంకర శర్మ ఆధ్వర్యంలో ద్విశతావధాన కళా విలాసం అపర్ణ ప్రతిభ కిరణ ద్యోతకం కార్యక్రమం నిర్వహించనున్నారు. 216మంది కవి పండితులతో ఈ కార్యక్రమం ఉంటుందన్నారు.

## నేడు జిల్లాకు కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు

**శ్రీకాకుళం టౌన్, జూన్28 (వార్త):** కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు శనివారం ఢిల్లీ నుంచి శ్రీకాకుళం జిల్లాకు రానున్నారు. 80 అడుగుల రోడ్డులో గల క్యాంపు కార్యాలయంలో ఉదయం 10 గంటల నుండి అందుబాటులో ఉంటారు.


## జనసేన నాయకుడు కుమార్‌కి పరామర్శ



**సంతబొమ్మాళి, జూన్ 28 (వార్త):** మండలంలో జనసేన పార్టీ అధ్య క్షుడు లింగూడు కుమార్‌ను నౌపడ పంచాయతీ తెలుగుదేశం పార్టీ నాయకులు పరామర్శించారు. శుక్రవారం సీతానగరంలోని కుమార్ స్వగ్రామానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. పొట్టలో ఏర్పడిన సమస్యతో గత 15 రోజులుగా కుమార్ చికిత్స పొందుతున్నాడు. మాజీ ఎంపీపీ ప్రతినిధి కర్రి విష్ణుమూర్తి, మాజీ ఎంపీటీసీ వాడరేవు కృష్ణారావు సీనియర్ జర్నలిస్ట్ కోట రామిరెడ్డి తెలుగు యువత నాయకుడు సుగ్గు నాగిరెడ్డి, మాజీ విద్యా కమిటీ చైర్మన్ అనపాన నగేష్ రెడ్డి, టిడిపి సీనియర్ నాయకుడు దల్లి రాజు సుబ్బా రావు సుగ్గు చిన్నారావు, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే శంకర్ సతీమణి స్వాతికి సన్మానం

**గార, జూన్ 28 (వార్త):** ఎమ్మెల్యే గొండు శంకర్ సతీమణి, నియోజక వర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు గొండు స్వాతిశంకర్‌ను వాడపాలెం గ్రామ స్థులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె గ్రామస్థులను ఉద్దేశించి మాట్లాడుతూ గ్రామస్థులు తన పట్ల, కుటుంబం పట్ల చూపిస్తున్న ఆద రణ మరువలేనిదన్నారు. గ్రామస్తులకు ఎల్లప్పుడూ అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## మైక్రో క్రెడిట్ ప్రకారమే రుణం

**ఆమదాలవలస, జూన్28 (వార్త):** స్వయంశక్తి సంఘాలలో పంచ సూత్రాలు పాటిస్తూ ఆదాయా భివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్న సంఘాలకు మైక్రో క్రెడిట్ ప్లాన్ ప్రకా రం అవసరమైన రుణం మంజూరు చేస్తామని ఆమదాలవలస స్టేట్ బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ కామేష్ తెలిపారు. శు క్రవారం మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో వెలుగు ఏపిఎం పైడి కూర్మారావుతో కలిసి మాట్లాడారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్య క్షురాలు తమ్మినేని ధనలక్ష్మి తో పాటు క్లస్టర్ కోఆర్డినేటర్ రమణ పాల్గొన్నారు.

## నౌపడలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

**సంతబొమ్మాళి, జూన్28(వార్త):** నౌపడలో ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో సత్యసాయి బాబా మంది రంలో శుక్రవారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహిం చారు. నౌపడ ఆయుర్వేద ఆసుపత్రి వైద్యాధికారిణి డాక్టర్ ఫణిమాధవి ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరంలో రోగు లకు సేవలు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ ఆయుర్వేద వైద్యంలో దీర్ఘకాలిక వ్యాధులకు పరిష్కార మార్గాలు ఉన్నాయని, ప్రజలందరూ ఆయుర్వేద మందులను విరివిగా వాడాలని ఆమె కోరారు. కీళ్ల నొప్పులు, గ్యాస్ ట్రబు ల్స్, ఇమ్యూనిటీ పెంచే మందులు, జలుబు, దగ్గు, జ్వరం, వైరల్ ఫీవర్స్, నడుము నొప్పి, తలనొప్పి, కీళ్లవాతము, నరాల బలహీనత, గ్యాస్ట్రిక్, చర్మవ్యాధులు తదితర వ్యాధు లకు మందులు ఆయుర్వేద శాలలో అందుబాటులో ఉన్నా యని తెలిపారు. ఆయుర్వేద వైద్యం పట్ల ప్రతి ఒక్కరు



అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ వైద్య శిబిరంలో 52 మంది రోగులకు పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యోగా శిక్షకులు యోగా చంద్ర శేఖర్, సత్తారు ఉషారాణి లు యోగ పై అవగాహన కల్పించి శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నౌపడ ఆయుర్వేద వైద్యశాల సిబ్బంది పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ కాంతుల వెలుగులో.. టెక్కలి ధగధగ



**టెక్కలి, జూన్ 28 (వార్త):** గత ఐదు సంవత్సరాలుగా వెలుగుకు నోచుకోని టెక్కలి పట్టణం నేడు విద్యుత్ కాంతుల వెలుగులతో ధగధగలాడుతోంది. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో జగతిమెట్ట నుంచి కొత్త జాతీయ రహదారి వరకు అప్పటి మంత్రి కింజరాపు అచ్చం నాయుడు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు. పట్టణంలో ఎవరు అడుగుపెట్టిన సిటీ మాదిరిగా వెలుగుతున్న లైట్లు చూసి టెక్కలి పట్టణం ఎంతో అభివృద్ధి చెందిందని మురిసిపోయేవారు. కానీ ఈ ఆనందం ఎన్నాళ్లు నిలవలేదు గతసారి రాష్ట్రంలో ఏర్పడిన వైఎస్ఆర్ ప్రభుత్వం స్థానిక నాయకులు ఈ లైట్లు పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. దీంతో అరకొరగా తప్పిస్తే లైట్లు కూడా వెలగని పరిస్థితి ఉండేది. జాతీయ రహదారిపై చిమ్మ చీకట్లు కమ్ముకుంటున్నా పట్టించుకునే నాధుడే కరువయ్యాడు. ఈ నేపథ్యంలో ఇటీవల రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడం, మళ్లీ అచ్చం నాయుడు మంత్రి కావడంతో త్వరితగతిన ఈ సెంట్రల్ లైటింగ్ పనులు జరిగాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి మండల పార్టీ అధ్యక్షుడు బగాది శేషగిరిరావు ఈ లైటింగ్‌ను ప్రారంభించారు. దీంతో తెలుగు తమ్ముళ్లు సంతోషం వ్యక్తం చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

జాతీయ **వార్త**
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం




## బీజేపీ నాయకుల సంబరాలు



**ఇచ్ఛాపురం, జూన్ 28, (వార్త):** కేంద్రంలో మూడవసారి ఎన్‌డీఏ పభుత్వం అధికారంలోకి వచ్చిన సందర్భంగా నరేంద్ర మోదీ ప్రధానమంత్రిగా హ్యాట్రిక్ సాధించడంతో పాటు, కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి రావడంతో బీజేపీ నాయకులు కార్యకర్తలు శుక్రవారం సంబరాలు చేసుకున్నారు. అనంతరం నియోజకవర్గ బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ బుద్దాల నిర్మలా రెడ్డికి సన్మానం చేశారు. కార్యక్రమంలో టి. కృష్ణ, కృష్ణవేణి,సుశీల, యు. కృష్ణవేణి , బాబు రావు, హేమ తదితరులు పాల్గొన్నారు.

## గంపెడు సమస్యల్లో
# పలాస మున్సిపాలిటీ..

**గత ఐదేళ్లుగా పలాస చీకటిమయం..**
**తాగునీటికి కటకట....జాడలేని పారిశుద్ధ్యం**
**రౌండ్ టేబుల్ సమావేశంలో**
**పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష**





**పలాస, జూన్ 28 (వార్త):** గంపెడు సమస్యల్లో పలాస మున్సిపాలిటీ ఐదేళ్లుగా కొట్టు మిట్టాడుతుందని, గత ప్రభుత్వ హయాంలో పలాస మున్సిపాల్టీని చీకటిమయం చేసేశారని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ సమన్వయకర్త వెంకన్న చౌదరి ఆధ్వర్యంలో టీడీపీ నాయకులతో శుక్రవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల సమస్యలను తీర్చాల్సిన బాధ్యత ప్రభుత్వం పై ఉంటుందని, అందుకు గాను ప్రతి వార్డు కౌన్సిలర్, ఇంచార్జ్‌లు చురుగ్గా పని చేయాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మున్సిపాలిటీలోని సమస్యలను ఎమ్యెల్యే దృష్టికి తీసుకువచ్చారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబురావు మాట్లాడుతూ గత ప్రభుత్వం వెయ్యికి పైగా టిడ్కో ఇళ్లను పూర్తి చేసి అలాగే వదిలేశారని, ఆ ఇళ్ల కోసం డీడీలు తీసిన లబ్దిదారులకు బలవంతంగా జగనన్న కోలనీలో స్థలాలను కట్టబెట్టారని పేర్కొన్నారు. చాలా మంది డబ్బులు కట్టి ఇబ్బందులు పడుతున్నారని వారందరికీ టిడ్కో ఇళ్లు ఇప్పించాల్సిందిగా కోరారు. అలాగే హుదూద్ తుపానులో కేటాయించిన ఇళ్లను కూడా లబ్దిదారులకు అందేలా చర్యలు చేపట్టాలన్నారు. కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్ మాట్లాడుతూ మున్సిపాలిటీలోని మెప్మా విభాగంలో అవకతవకలు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయని, ఆ అంశంపై దృష్టి సారించి, డ్వాక్రా సంఘాలకు న్యాయం చేయాలని కోరారు. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మాట్లాడుతూ గతంలో రైతు బజార్‌కు పునాది వేసిన స్థలంలోనే రైతుబజార్ నిర్మించాలని, ఆ స్థలానికి ఆనుకుని ఉన్న కర్ర బడ్డీల స్థానంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తే బాగుంటుందని పేర్కొన్నారు. ఇంటి కుళాయి పైపుల ద్వారా మున్సిపాలిటీకి తాగునీరందించాలని కోరారు. టీడీపీ రాష్ట్ర బీసీ సంఘ నాయకులు లొడగల కామేశ్వరరావు మాట్లాడుతూ పారిశుద్ధ్యం పనులు సక్రమంగా జరగడం లేదని వాటిపై దృష్టి సారించాలని తెలిపారు. సమస్యలపై సానుకూలంగా శిరీష స్పందిస్తూ పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీలోని సమస్యలను పరిష్కరిస్తామన్నారు. అర్హులైన వారికి టిడ్కో, హుదూద్ ఇళ్లను అందిస్తామన్నారు.

## తోటపల్లి బ్యారేజ్ ప్రాజెక్టు
# కుడికాలువ నీటి విడుదల



**వీరఘట్టం, జూన్ 28 (వార్త):** సర్దార్ గౌతు లచ్చన్న తోటపల్లి బ్యారేజ్ ప్రాజెక్టు సాగు నీటిని ఖరీఫ్ పంటకు రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మరియు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యా రాణి శుక్రవారం విడుదల చేశారు. తోటపల్లి బ్యారేజ్ ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ వద్ద జరిగిన కార్యక్రమంలో పాలకొండ శాసన సభ్యులు నిమ్మక జయకృష్ణ, కురుపాం శాసన సభ్యులు తోయక జగదీశ్వరి సమక్షంలో మంత్రి నీటిని విడుదల చేశారు. వర్షం కురుస్తున్నా లెక్క చేయకుండా, రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామన్నారు. వాస్తవానికి కుడి ప్రధాన కాలువ ద్వారా ప్రాజెక్టు క్రింద మొత్తం 1,31,221 ఎకరాల ఆయకట్టుకు నీరు అందనుంది. కుడి ప్రధాన కాలువ క్రింద పార్వతీ పురం మన్యం జిల్లాలో సీతానగరం, బలిజిపేట మండలాలలో 27 గ్రామాలకు చెందిన 13,684 ఎకరాలకు సాగునీరు అందుతుండగా విజయనగరం జిల్లాలో బొబ్బిలి, చీపురుపల్లి, నెల్లిమర్ల, రాజాం నియోజక వర్గాలలోని 13 మండలాలలో 66 గ్రామాలకు చెందిన 25,060 ఎకరాలు, శ్రీకాకుళం జిల్లాలో ఎచ్చెర్ల నియోజక వర్గంలో జి సిగడాం, లావేరు, రణస్థలం మండలాలలో 105 గ్రామాలకు చెందిన 38,975 ఎకరాలకు సాగునీరు అందుతుంది. వెరసి 333 గ్రామాలకు చెందిన 1,31,221 ఎకరాలకు ప్రధాన కుడి కాలువ ద్వారా సాగునీరు అందుతుంది. ఇందులో 84,033 ఎకరాలు స్థిరీకరణ, 47,188 ఎకరాలు కొత్త ఆయకట్టుగా ఉంది. ఈ సందర్భంగా మంత్రి సంధ్యారాణి మాట్లాడుతూ పూడికలు, తుప్పలు తొలగించి శివారు భూములకు సైతం నీరు అందించాలన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అపర భగీరథుడని, తోటపల్లి ప్రాజెక్ట్‌ను ప్రారంభించి శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలను సస్య శ్యామలం చేసారని తెలిపారు. తోటపల్లి, జంఝావతి ప్రాజెక్టులు, పూర్ణపాడు – లాబేసు వంతెన నిర్మాణం పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తున్నామని అన్నారు. కురుపాం శాసన సభ్యులు తోయక జగదీశ్వరి మాట్లాడుతూ రైతులు పంటలు వేయుటకు భూములను సిద్ధం చేయాలని అన్నారు. పాలకొండ శాసన సభ్యులు నిమ్మక జయకృష్ణ మాట్లాడుతూ శివారు భూములకు నీరు చేరే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, ఉత్తర కోస్తా జలవనరుల శాఖ చీఫ్ ఇంజనీర్ ఎస్.సుగుణాకర రావు, పర్యవేక్షక ఇంజనీరు రాజరాజేశ్వరి, కార్యనిర్వాహక ఇంజనీర్లు జి.రామచంద్రరావు, ఆర్ అప్పల నాయుడు, ఉప కార్యనిర్వాహక ఇంజనీర్ శ్రీహరి స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా ఉపాధ్యక్షులు గర్భాన సత్తిబాబు, పాలకొండ మండల టిడిపి అధ్యక్షుడు గండి రామినాయుడు, వీరఘట్టం మండల టిడిపి పార్టీ అధ్యక్షులు ఉదయాన ఉదయ భాస్కర్, పాలకొండ పట్టన అధ్యక్షులు గంట సంతోష్, పాలకొండ నియోజకవర్గం రైతు సంఘం నాయకులు బుడతి అప్పల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## గన్ మెన్‌లను వెనక్కు పంపిన కూన రవికుమార్

**పొందూరు, జూన్ 27 (వార్త):** ఆముదాలవలస టీడీపీ ఎమ్మెల్యే కూన రవికుమార్ తన గన్‌మెన్లను వెనక్కు పంపారు. తనకు ఎవరూ రక్షణ అవసరం లేదని ఆయన తెలిపారు. ఆయన మంత్రి పదవి దక్కలేదన్న అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం. కాళింగ సామాజికవర్గానికి మంత్రి పదవి దక్కకపోవడంతో ఉత్తరాంధ్ర నేతల్లో కొంత అసంతృప్తి ఉన్నప్పటికీ కూన రవికుమార్ మాత్రం త్వరగా బయటపడ్డారు. తనకు శత్రువులు ఎవరూ లేరని, రక్షణగా గన్‌మెన్లు అవసరం లేదన్నారు.

తాను అధికారంలో ఉన్నప్పటి కంటే ప్రతిపక్షంలోనే బలంగా పనిచేశానని, ప్రజల్లో నిత్యం ఉన్నానని తెలిపారు. తనకు గన్‌మెన్లు అవసరం లేదని, వారిని తిప్పిపంపడంతో ఇప్పుడు తెలుగుదేశం పార్టీలో హాట్ టాపిక్‌గా మారింది. సాధారణ ఎమ్మెల్యేగా ప్రజలకు సేవ అందించడమే తనకు మంచిదని ఆయన చెప్పుకొచ్చారు.



## నేడు ఉమారుద్రునికి జలాభిషేకం

**హిరమండలం, జూన్ 28 (వార్త):** హిరమండలం మేజర్ పంచాయతీ చిన్నకోరాడ వీధిలో ఉమారుద్ర కోటీశ్వర ఆలయంలో రుద్రాభిషేకం, జలాభిషేకం పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ వర్షాలు సకాలంలో సంవృద్ధిగా కురవాలని కోరుతూ శనివారం ఉదయం 9 గంటల నుంచి జలాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండిస్తున్న పంటలు సంవృద్ధిగా పండాలని,ప్రతీ ఏటా శివాలయానికి జలాభిషేకం పూజలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతీ ఒక్కరూ పాల్గోని విజయవంతం చేయాలని వారు కోరారు

## ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య



**హిరమండలం, జూన్ 28 (వార్త):** ప్రైవేటు పాఠశాలల కన్నా ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య అందజేస్తున్నామని మండల విద్యాశాఖాధికారి కె.రాంబాబు సూచించారు.శుక్రవారం మండలంలో పిండ్రువాడ కాలనీ ఎంపియుపి పాఠశాలలో నేడు బడికి పోతా కార్యక్రమంలో భాగంగా అవగాహాన కార్యక్రమాన్ని నిర్వ:హించారు. ప్రతీ ఒక్కరూ చదువుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యతో పాటు మౌళిక సదుపాయాలు,విద్యార్ధులకు ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు వర్తిస్తాయన్నారు. అనంతరం సామూహిక అక్షరాభ్యాసాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.రాంబాబు, ఉపాధ్యాయ సిబ్బంది కైవాడ గిరిబాబు, విజయ్‌కుమార్, దీనకుమారి, తారకరామారావు, అప్పలనాయుడు పాల్గొన్నారు.

## వంశధారలో జలకళ



**హిరమండలం, జూన్ 28 (వార్త):** ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండిస్తున్న పంటలకు సాగునీరు అందజేయాలనే ఉద్దేశంతో గొట్టాబ్యారేజిలో వంశధార నీటి నిల్వలు సంబంధిత అధికారులు చేపడుతున్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చన్నాయుడు ఆదేశాల మేరకు కుడి,ఎడమ ప్రధాన కాలువలకు సాగునీరు అందజేయాలనే ఆదేశాల మేరకు గొట్టాబ్యారేజి 22 గేట్లను మూసివేసి ఎగువన నీటి నిల్వలు చేపట్టారు. వంశధార నది తీర ప్రాంత గ్రామాల్లో కురిసిన వర్షాలకు గొట్టాబ్యారేజి వద్ద నీరు చేరుతుంది. జూలై మొదటి వారంలో సాగునీటిని విడిచిపెట్టేందుకు చర్యలు చేపడుతున్నారు

## భూసేకరణ చెల్లింపులు వేగంగా జరగాలి

**విజయనగరం, జూన్ 28(వార్త):** జిల్లాలో పలు ప్రాజెక్టులకు జరుగుతున్న భూ సేకరణ పనులు వేగంగా జరగాలని, అదే విధంగా చెల్లింపులు కూడా సత్వరమే జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్. అంబేద్కర్ తెలిపారు. శుక్రవారం అయన ఛాంబర్ లో భోగా పురం ఎయిర్ పోర్ట్ పనులు, జాతీయ రహదారులు, రైల్వే పనులు, ఇరిగేషన్ ప్రాజెక్టు పనులపై ఆయా అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. భోగాపురం ఎయిర్ పోర్ట్ పనులకు సంబంధించి మ్యాప్ లను పరిశీలించారు. ఆర్ అండ్ ఆర్ అంశాల పై ఆరా తీసారు. ఆర్.డి.ఓ సూర్య కళ మాట్లాడుతూ రన్ వే , అప్రోచ్ రోడ్ పనులు పురోభివృద్ధిలో ఉన్నాయని, ఆర్ అండ్ ఆర్ సమస్యలేమీ లేవని వివరించారు. ప్యాకేజి 1 లో మ్యుటేషన్ సమస్యలు ఉన్నాయని, 3 లో రోడ్ పై విగ్రహాలు తొలగించవలసి ఉందని, చెల్లింపులు కొంత మేరకు పెండింగ్ ఉన్నాయని డిప్యూటీ కలెక్టర్లు తెలిపారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## సకాలంలో వర్షం.. రైతుల్లో హర్షం..

**జలుమూరు, జూన్ 28 (వార్త):** గత కొద్ది రోజులుగా విత్తనాలు చల్లి వర్షం కోసం ఎదురు చూసి నిరాశ చెందిన రైతులకు గురువారం కురిసిన వర్షంతో ఆనందం వెల్లివిరిసింది. విత్తనాలు చల్లిన రైతులు అందరూ ఎంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎండ వేడిని తట్టుకోలేని ప్రజలు వర్షం కారణంగా వాతావరణ చల్లబడటం అందరూ ఆనందం వ్యక్తపరిచారు.

## ఏఐమ్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా తైక్వాండో శ్రీను



**శ్రీకాకుళం టౌన్, జూన్ 28, (వార్త):** అంబేద్కర్స్ ఇండియా మిషన్ (ఏఐమ్) రాష్ట్ర ఉపాధ్యక్షులుగా తైక్వాండో శ్రీను నియమితులయ్యారు. ఏఐమ్ యువ సైనిక్ రాష్ట్ర కన్వీనర్‌గా ఉన్న ఆయనకి ప్రమోషన్ లభించింది. ఈ మేరకు అంబేద్కర్స్ ఇండియా మిషన్ వ్యవస్థాపక అధ్యక్షులు ,సీనియర్ ఐపిఎస్ అధికారి పి.వి.సునీల్ కుమార్ సూచనల మేరకు వర్కింగ్ ప్రెసిడెంట్ కొంకి హరికృష్ణ నియమించారు. బాబా సాహెబ్ డా.బి.ఆర్.అంబేద్కర్ ఆశయాల సాధన కోసం దళితుల అభ్యున్నతి కోసం అంబేద్కర్స్ ఇండియా మిషన్ రాష్ట్రంలో పనిచేస్తుంది. దళితులను చైతన్యవంతులను చేసి వారి హక్కుల సాధించుకునేందుకు అంతా కలిసి పోరాటం సాగించడం కోసం ఏఐమ్ నిర్ధిష్టమైన లక్ష్యాలతో పనిచేస్తుంది. మన వాడ-మన పంచాయతీ సాధనే ప్రధాన ఎజెండా ఏఐమ్ పనిచేస్తూ రాష్ట్రంలో ప్రత్యేక గుర్తింపు పొందింది. అటువంటి సంస్థకు రాష్ట్ర ఉపాధ్యక్షులుగా పనిచేసే అవకాశం తైక్వాండో శ్రీనుకి దక్కింది. అంబేద్కర్స్ ఇండియా మిషన్ లో చేరిన అనతికాలంలోనే రాష్ట్ర స్థాయిలో తైక్వాండో శ్రీను గుర్తింపు పొందారు. ఏఐమ్ సభలు, సమావేశాలు ఏర్పాటు చేసే క్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా పర్యటనలు సాగించి ఏఐమ్ పెద్దల వెంట నడిచారు. ఈ సందర్భంగా తైక్వాండో శ్రీను మాట్లాడుతూ రాష్ట్రంలో అంబేద్కర్స్ ఇండియా మిషన్ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. అన్ని జిల్లాలలో కూడా ఏఐమ్ బలంగా ఉందని రానున్న రోజులలో మరింత శక్తివంతంగా తీర్చిదిద్దేందుకు తనవంతు ప్రయత్నం చేస్తానన్నారు. బాధ్యతలను అప్పగించిన వ్యవస్థాపక అధ్యక్షులు పి.వి.సునీల్ కుమార్ కి,వర్కింగ్ ప్రెసిడెంట్ కొంకి హరికృష్ణలకి తైక్వాండో శ్రీను కృతజ్ఞతలను తెలియజేసారు.

## బెల్లుపడ స్కూల్లో స్టూడెంట్ కిట్ల పంపిణీ



**ఇచ్ఛాపురం, జూన్ 28 (వార్త):** బెల్లుపడా స్కూల్‌లో స్టూడెంట్లకు శుక్రవారం కిట్లు పంపిణీ హెచ్.ఎమ్. నల్ల నీలచలం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం కూటమి నాయకులు ఆసి జీవులు రెడ్డి, గిన్ని చిన్న రెడ్డి. రియ్యి జానీ, గిరీష్, శ్రీధర్, కుర్మా, రాము, నీలవేణి తదితరులు పాల్గొన్నారు.

## శాంతినికేతన్ హైస్కూల్‌లో 'శుభ్రత పరిశుభ్రత'



**ఇచ్ఛాపురం, జూన్ 28 (వార్త):** స్థానిక శాంతికేతన్ ఇంగ్లీషు మీడియం హైస్కూల్లో శుభ్రత పరిశభ్రత కార్యక్రమంపై అవగాహన సదస్సు స్కూల్ చైర్మన్ డి కృష్ణమూర్తి రెడ్డి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణం దృశ్యా పిల్లలందరూ ప్రతీ రోజు భోజనం ముందు, భోజనం తరువాత చేతులను శుభ్రంగా కడుక్కోవాలని, చుట్టూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, ఆరుబయట తినుబండా రాలని తినకూడదని, ఇంట్లో వండిన పదార్థాలను మాత్రమే భుజించాలని పిల్లలకు అవగాహన కల్పించాలన్నారు. పిల్లందరూ ఆరోగ్యాంగా ఉండేలా చూడాలని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో స్కూల్ మేనేజర్ కె. సి. పూరి, ఉపాధ్యాయులు శంకర్ శ్రీధర్, రోజా, స్నేహ, పార్వతి మీనా విద్యార్థినీ విద్యార్థులు మరియు వార్డ్ సానిటరీ సెక్రటరీ ప్రమీల, వార్డ్ హెల్త్ సెక్రరరీ శాంతా కుమారి, అంగన్వాడీ ఉపాధ్యాయులు కోమలి, పుణ్యవతి ఆశ వర్కర్స్ ఇందిరా సరోజినీ, రామలక్ష్మి పాల్గొన్నారు.

## విద్యుత్ మీటర్ రీడర్స్ సమస్యలు పరిష్కరించండి

**ఇచ్ఛాపురం, జూన్ 28 (వార్త):** విద్యుత్ మీటర్ రీడర్‌ల అసోసియేషన్ సభ్యులు మరియు ఇచ్ఛాపురం వాలేంటీర్లు కలిసి తమ వినతిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఇచ్ఛాపురం జనసేనపార్టీ నాయకులు దాసరి రాజుకు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఇచ్ఛాపురం జనసేనపార్టీ కార్యాలయంలో ఇచ్ఛాపురం విద్యుత్ మీటర్ రీడర్స్ అసోసియేషన్ లో పని చేస్తున్న సభ్యులు అప్పటి టీడీపీ హయాంలో నెల రోజులు పని కల్పించేలా జీవో ఇచ్చారని, మళ్ళీ వైసీపీ ప్రభుత్వంలో టీడీపీ ఇచ్చిన జీవో చెల్లుబాటు కాదని, మాకు ఇచ్చిన వేతనాల్లో కూడా వైసీపీ కాంట్రాక్టర్లు దోపిడీకి పాల్పడి కక్ష సాధింపు చర్యలకు పాల్పడి పనిదినాలు తగ్గించి కడుపు కొట్టారని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ దృష్టికి మరియు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకుని వెళ్లాలని వినతి పత్రం అందజేశారు. అదే విధంగా ఇచ్ఛాపురం నియోజకవర్గ మాజీ వాలేంటీర్లు కలిసి వైసీపీ ప్రభుత్వం ఒత్తిడి తీసుకువచ్చి మమ్మల్ని రాజీనామా చేయించారని మళ్ళీ తమను విధుల్లోకి తీసుకోవాలని వినతిపత్రం సమర్పించారు.

# భారీగా పెంచిన స్కూల్ ఫీజులు

### అక్రమ పద్ధతిలో అమ్ముతున్న అక్షరాలు
### తల్లిదండ్రులకు భారంగా మారిన ప్రయివేట్ స్కూళ్ల చదువులు
### ప్రయివేట్ విద్యా సంస్థలపై నియంత్రణ చేయాలి విద్యార్థి సంఘాలు

**పలాస, జూన్ 28 (వార్త):** ప్రభుత్వ నిబంధనలను అమలు చేయకుండా ధనార్జనే ధ్యేయంగా ప్రయివేట్ విద్యాసంస్థలు అక్షరాలను అక్రమ పద్దతిలో అమ్ముకుంటున్నారు.. విద్యా సంవత్సరం ప్రారంభంలోనే ప్రైవేట్ పాఠశాలలు భారీగా ఫీజులు పెంచాయని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఎల్‌కేజీ నుంచి డిగ్రీ వరకు , బస్సు ఫీజులతో పాటు, పుస్తకాలు, బట్టలు, కాలి బూట్లు ధరలు కూడా పెంచారన్నారు. మూడు నెలలకోసారి టెర్మ్ ఫీజులు, ఆరు నెలలకొకసారి సెమిస్టరు ఫీజు అంతే కాకుండాచ ఏడాది ఒక సారి బిల్డింగ్ పీజులు ఇలా లక్షల్లో ఫీజులు పెంచడంతో సామాన్య మధ్యతరగతి వర్గాలు చెందినవారు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అక్షరాలతో అక్రమంగా విద్యా వ్యాపారం చేస్తున్న ప్రైవేటు సంస్థలకు అడ్డుకట్ట వేయాలని ప్రభుత్వానికి విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు, విద్యార్థి సంఘాలు కోరుతున్నాయి. అంతేకాకుండా ప్రస్తుతం నడిపిస్తున్న విద్యాసంస్థలకు ప్రభుత్వ అనుమతులు పొందలేదన్న ఆరోపణలు ఉన్నాయి. సామాన్య, మధ్యతరగతి వర్గాలకు చెందిన వారి సంపాదన కుటుంబాలు గడవడానికి కష్టంగా ఉంటే



తమ పిల్లలు చదువులు కోసం ప్రైవేట్ విద్య సంస్థలు భారీగా ఫీజులు పెంచడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. అక్రమ పద్ధతుల్లో నిబంధనలు పాటించకుండా అక్షరాలు లక్షలకు అమ్ముకుంటున్న విద్యా సంస్థలపై తగిన చర్యలు తీసుకొని విద్యార్థుల తల్లిదండ్రులకు న్యాయం చేయాలని పలువురు కోరుతున్నారు.

# ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తాం

### ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి



**జలుమురు, పోలాకి జూన్ 28 (వార్త):** పోలాకి మండలం బొద్దాం జంక్షన్ నుండి దండు లక్ష్మీపురం జంక్షన్ వరకు 18R కాలువ పూడికతీత పనులను ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి శుక్రవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగునీటి కాలువలు మరమ్మతు పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కూటమి ప్రభుత్వం వ్యవసాయ రంగానికి ప్రాధాన్యతను ఇస్తుందని, రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందన్నారు. చిట్టచివరి భూములకు సైతం సాగునీరు అందేలాగా చర్యలు తీసుకోవాలని సాగునీటి ప్రవాహానికి



అడ్డంకులు లేకుండా చూడాలని, గుర్రపు డెక్క , పూడికతీత పనులు, మరమ్మత్తు పనులు అవసరమైతే యుద్ధ ప్రాతిపదికన చేపట్టి పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మిరియాపల్లి వెంకటప్పలనాయుడు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ భైరి భాస్కరరావు, మాజీ మండల పరిషత్ అధ్యక్షులు తమ్మినేని భూషణ్ రావు, లుకలాపు రాంబాబు, డోల ప్రసాద్, కరుకోల దుష్యంత్, గొర్లె ఎర్రయ్య పాలిన ప్రసాద్, చింతు కర్రెన్న, బెవర సింహాద్రి, అన్నాజీరావు, మురళి మరియు వంశధార డిపార్ట్మెంట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# చినుకు పడితే చాలు ఆ వీధి చిత్తడి.. చిత్తడి..

### వర్షపు నీరు నిల్వలతో ప్రజల అవస్థలు... డ్రైనేజీ లేక వర్షపు నీరు నిల్వలు...

**వజ్రపుకొత్తూరు, జూన్ 28 (వార్త):** ప్రతి దఫా వర్షం పడితే చాలు ఆ వీధి ప్రజల అవస్థలు వర్ణనాతీతం. తుఫానులు భారీ వర్షాలు సంభవించినా ఆ వీధిలో వారం రోజులు వరకు వర్షపు నీరు నిల్వ ఉండటం వల్ల ప్రజలు అనేక రోగాల బారిన పడాల్సి వస్తుంది. వజ్రపు కొత్తూరు మండలం హుకుంపేటలో సూరాడ వీధి ప్రజల పరిస్థితి ఇది. వర్షపు నీరు నిలిచిపోవడంతో ప్రజలు అనేక ఇక్కట్లకు గురవుతున్నారు. శుక్రవారం సాయంత్రం గంటపాటు ఏక దాటిగా కురిసిన వర్షానికి సూరాడవీధి ముంపుకు గురైంది. వర్షపు నీరు నిల్వ వల్ల ఆ వీధిలో ఈగలు, దోమలకు ఆలవాలంగా మారి ప్రజలు అనేక రోగాలు బారిన పడుతున్నారు. సూరాడ వీధి లోతట్టు ప్రాతం అవడం వల్ల గ్రామంలో అన్నివీధుల వర్షపు నీరు నిలిచి ప్రజలు నానా ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. దీంతో అక్కడి ప్రజలు డ్రైనేజి సౌకర్యం కల్పించాలని, లేదా లోతట్టును ఎత్తు చేయాలని ఎన్నిమార్లు ప్రభుత్వానికి విన్నవించుకున్నా స్పందించిన దాఖలాలు లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత పదేళ్లుగా ఇదే పరిస్థితిని ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు. ప్రజాప్రతినిధులకు ఎన్నిమార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని, ఈ ప్రభుత్వమైనా తమ గోడు వినిపించుకొని, తమను రోగాల బారిన పడకుండా రక్షించాలని ఎమ్మెల్యే గౌతు శిరీషను కోరుతున్నారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## జెడ్పీ స్కూల్లో విద్యార్థులకు బ్యాగుల పంపిణీ



**పలాస, జూన్ 28 (వార్త):** పలాస మండలం బొడ్డపాడు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బ్యాగులను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కిక్కర ఢిల్లీ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, అలాగే ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ తో పాటు పలాస ఎమ్మెల్యే గౌత శిరీష ఆదేశాల మేరకు విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులతో విద్యా కమిటీ చైర్మన్ జోగారావు పాటు బొడ్డు దుష్యంతు, మురిపింటి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రయివేట్ పాఠశాలలు నిబంధనలకు నీళ్లు..

- విద్యా శాఖ అనుమతులు కొందరికైనా ఉన్నాయా?
- క్రీడామైదానం లేకుండా స్కూళ్లు
- టీచర్ల జీతాలు అంతంత మాత్రమే?
- ఈ వ్యవహారంపై దృష్టి సారించాలి
- విద్యాశాఖ అధికారులు వెలుగులు తేవలసిందే




**పలాస, జూన్ 28(వార్త):** ప్రైవేట్ పాఠశాలల్లో నిబంధనలకు నీళ్లు వదలడంతోపాటు ఆయా పాఠశాలలకు అనుమతులకు సంబంధించి విద్యాశాఖ అధికారులపై పలు అనుమానాలుకు వ్యక్తం అవుతున్నాయి. నిజానికి పాఠశాలకు సంబంధించి ఏర్పాటు కోసం విద్యాశాఖ అధికారుల నుంచి తగిన అనుమతులు పొందాల్సి ఉంది. ఆ అనుమతుల్లో విద్యార్థులకు తగిన వసతి సౌకర్యంతో పాటు ఇతర ఆరోగ్య సూత్రాలు కూడా అదే పాఠశాలలో ఉండే విధంగా ప్రతిపాదనలతో పాటు ముందస్తుగా ఉన్న తాధికారులకు తెలియజేయాల్సి ఉంది. ముఖ్యంగా పాఠశాల సంబంధించి విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యం పెంచేందుకు వీలుగా పాఠశాల దగ్గరలోనే రెండు ఎకరాలు దాటకుండా ఆటస్థలం ఉండాలి. కానీ ఆచరణలో ప్రైవేట్ పాఠశాలలు రెండు మూడు అంతస్తులు భవనాలు కట్టి విద్యార్థులను సేకరించి ఆ భవనాలు నిండా పెడుతున్నారు. కానీ అందులో కూడా నిబంధనలకు అనుగుణంగా ఆ విద్యా సంస్థల్లో ఎలాంటి సౌకర్యాలు లేవని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. అంతేకాకుండా పట్టభద్రులైన ఉపాధ్యాయులు నియమించి వారికి, జీతాలు రూ. ఎనిమిది వేలనుండి రూ. పదివేలకు మించకుండా ఇస్తున్నారని సమాచారం.

అయినప్పటికీ ఆ ఉపాధ్యాయులంతా పాఠశాలలో విద్యార్థుల అభివృద్ధి కోసం వారి ఉత్తీర్ణత కోసం నిత్యం పాటుపడుతున్నారు యదార్థమైన విషయం. అటు నిబంధనలకు పాటించకుండా.. విద్యార్థులు అధిక ఫీజులు వసూలు చేస్తూ, ఉపాధ్యాయులకు తగిన వేతనం చెల్లించకుండా వారిని మోసం చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం జోక్యం చేసుకొని నిబంధనల ప్రకారం ప్రైవేట్ పాఠశాలలో విద్యను అందించాలని విద్యార్థి సంఘాలు కోరుతున్నాయి.

# వైసీపీకి ఎదురు నిలిచిన కిక్కర..

నిత్య రాజకీయ బెదిరింపులు...
ఉపాధిపై ఆంక్షలు
బొడ్డపాడు సర్పంచ్‌గా పోటీ..
కష్టాలు ఎన్ని పడిన వెనుకడుగు వేయని నైజం..
తెలుగు దేశం పార్టీ నేత కిక్కర?..



**పలాస, జూన్ 28(వార్త):** ఉద్దానం లోని విప్లవానికి కేంద్రమైన బొడ్డపాడు గ్రామానికి చెందిన కిక్కర ఢిల్లీరావు కళాకారుడు, పేద విద్యార్థులకు సైతం తనవంతు సహాయం అందిస్తూ అందరి మన్ననలను అందుకున్నారు. గత ప్రభుత్వం అనేక విధాలుగా ఎన్నో ఇబ్బందులకు గురిచేసినా టీడీపీ పార్టీ తరఫున సర్పంచ్‌గా పోటీ చేసి విజయం సాధించారు. ఈయన జానపద కళలు, విప్లవ పాటలపై రాష్ట్రమంతటా ప్రదర్శనలు నిర్వహిస్తూ వచ్చే ఆదాయంతో క్రీడాకారులకు అలాగే పేద విద్యార్థులకు సహాయం చేస్తూ అందరి ఆదరాభిమానాన్ని సంపాదించుకున్నారు. ఈయన సేవలను టీడీపీ గుర్తించి ప్రోత్సహించడంతో ఆ పార్టీ పట్ల విధేయత కలిగి పార్టీ విజయానికి ఢిల్లీరావు ఎంతగానో కృషిచేశారు. వైఎస్ ఆర్ పార్టీ అధికారములో ఉన్నప్పుడు బొడ్డపాడులో తెలుగుదేశం ఆశీస్సులతో సర్పంచ్‌గా పోటీ చేశారు. అప్పట్లో వైసీపీ బెదిరింపులుతో పాటు ఉపాది అవకాశాలపై అడ్డుపడినా వెనుకడుగు వేయకుండా తెలుగుదేశం పార్టీ, నేటి ఎమ్మెల్యే గౌతు శిరీష అండదండలతో విజయం సాధించారు. ఐదేళ్లగా వైసీపీ పార్టీ వేధింపులు తట్టుకుంటూ తెలుగుదేశం పార్టీ విజయానికి కృషి చేసి, అలుపెరుగని పోరాటం చేసి తన వంతు సహాయం సహకారాలు అందించారు. తెలుగు దేశం పార్టీకి ఎంతగానో కృషిచేసిన ఢిల్లీరావుకు ఎమ్మెల్యే శిరీష ఏ మేరకు పార్టీలో స్థానం ఇస్తారో వేచి చూడాలసి ఉందని ఇక్కడ కిక్కర అభిమానులు వేచి చూస్తున్నారు.

# రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

## మంత్రి గుమ్మిడి సంధ్యారాణి




**వీరఘట్టం, పాలకొండ, జూన్ 28 (వార్త):** రాష్ట్రంలో రైతు ప్రభుత్వం ఉందని రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మరియు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యా రాణి అన్నారు. సర్దార్ గౌతు లచ్చన్న తోటపల్లి బ్యారేజ్ ప్రాజెక్టు నీటిని ఖరీఫ్ పంటకు రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మరియు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యా రాణి శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మంత్రి మాట్లాడుతూ రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. రైతు లకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా శివారు భూములకు కూడా సాగు నీటిని అందించేందుకు చర్యలు చేపడతామన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అపర భగీరధుడని, తోటపల్లి ప్రాజెక్ట్‌ను ప్రారంభించి శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలను సస్యశ్యామలం చేశారని తెలిపారు. తోటపల్లి, జంఝావతి ప్రాజెక్టులు, పూర్ణపాడు - లాబేసు వంతెన నిర్మాణం పూర్తి చేయుటకు ప్రయత్నిస్తున్నామని ఆమె చెప్పారు. రైతులు రెండు పంటలు పండించుకోవచ్చన్నారు. వలసలు వెళ్ళే అవసరం ఇక ఉండదన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంచి పాలనాదక్షులని, రాష్ట్రంలోకి పెట్టుబడులు వస్తున్నాయని చెప్పారు. పోలవరం ప్రాజెక్ట్ గతంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉండగా 70 శాతం పనులు పూర్తి అయ్యాయని, గత ఐదు సంవత్సరాల కాలంలో ఎటువంటి ప్రగతి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సాగునీటికి ముఖ్యమంత్రి అధిక ప్రాధాన్యతను ఇస్తున్నారన్నారు. ఐటీడీఏలు పూర్తి స్థాయిలో పనిచేయుటకు అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు తమ సమస్యలను తనకు, శాసన సభ్యులకు నేరుగా తెలియజేయవచ్చని ఆమె అన్నారు. జిల్లా సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తామని, అవసరమైన నిధులను తీసుకువచ్చుటకు ముఖ్యమంత్రిని కూడా కలుస్తామని చెప్పారు. ఏనుగుల తరలింపుకు గతంలోవలె ఆపరేషన్ గజ వంటి కార్యక్రమం నిర్వహించుటకు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లినట్లు ఆమె తెలిపారు. ఈ మీడియా ప్రతినిధుల సమావేశంలో కురుపాం శాసన సభ్యులు తోయక జగదీశ్వరి, పాలకొండ శాసన సభ్యులు నిమ్మక జయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# బాలకార్మికులను పనిలో పెడితే కఠిన చర్యలు

**ఇచ్ఛాపురం, జూన్ 28 (వార్త):** మండలంలో బాలకార్మికుల రెస్క్యూ లేబర్ ఆఫీసర్ శుక్రవారం నిర్వహించారు. ఇందులో భాగంగా మార్కెట్, బేకరీ షాపుల్లో బాలకార్మికుల గురించి అవగాహన కల్పించారు. ఈ ఆపరేషన్‌లో గోపాలకృష్ణ లేబర్ ఆఫీసర్ విజయ్ కుమార్, చైల్డ్ హెల్ప్‌లైన్ స్వాతి మరియు అప్పలనాయుడు పాల్గొన్నారు.



# ఆహార పదార్థాలకు లైసెన్స్ కలిగి ఉండాలి

## ఆహార నియంత్రణ అధికారి ఈశ్వరి



**వీరఘట్టం, జూన్ 28 (వార్త):** జిల్లాలోని ఆహార వ్యాపార నిర్వాహకులు, హోటల్ మరియు మిఠాయి తయారీదారులు అందరూ విధిగా లైసెన్స్‌లు కలిగి ఉండాలని ఆహార నియంత్రణ అధికారి ఎస్. ఈశ్వరి తెలిపారు. ఈమేరకు ఆమె శుక్రవారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. fssai Act 2006 కు లోబడి తప్పని సరిగా లైసెన్స్ ను కలిగి ఉండాలని లేని యెడల ఆహార భద్రతా చట్టం 2006 ను అనుసరించి చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. రాష్ట్ర ఆహార భద్రత కమీషనర్, జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం, జిల్లాలో మిఠాయి దుకాణాలు, హోటల్ లలో తనిఖీలు మరింత ముమ్మరం చేస్తామని తెలిపారు. ఆహార పదార్థాలకు లైసెన్స్ లేని యెడల ఐదు లక్షల రూపాయలు /ఆరు నెలల వరకు జైలు శిక్ష విధించే అవకాశం ఉంటుందని తెలిపారు. పరిశుభ్రత పాటించని మిఠాయి దుకాణాలు, హోటల్ నిర్వాహకుల ఆహార భద్రత లైసెన్స్‌లు రద్దు చేస్తామని ఈ సందర్భంగా ఆమె తెలిపారు.

Printed and published on behalf of CHOWDARI and printed at RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam. srikakulam dist. ANDHRAPRADESH STATE 532001 published at RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam dist ANDHRAPRADESH STATE 532001 Editor: Chowdari Pramod E-mail:jatheeyavaartha @gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:016413